క్లుప్తంగా

నేటి నుంచి దేవర ఉత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

రామసముద్రం : మండలంలోని పెద్దకురప్పల్లి పంచాయతీ మట్లవారిపల్లిలో వెలసిన శ్రీ సిగేరేశ్వర, శ్రీ భత్తేశ్వర, శ్రీ బీరేశ్వర, శ్రీ ఉజ్జనేశ్వర స్వామి దేవర ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈనెల 5న పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహణ, గజపతి పూజ, 6న కలశాస్థాపన, 7న రుద్రాభిషేకం, రాత్రి 7 గంటలకు ప్రాకారోత్సవం, 8న గురుపూజ, ఎద్దు పూజ, రాత్రి 7 గంటలకు ప్రాకోత్సవం, 9న ఉదయం కళ్యాణోత్సవం మధ్యాహ్నం 2 గంటలకు నుండి 4 గంటల వరకు భక్తాదుల తలపై టెంకాయ ప్రమాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. రాత్రి 7 గంటలకు దీపారాధన నిర్వహించి దేవర ముగింపు చేయనున్నట్లు తెలిపారు.

బియ్యం పంపిణీ వేగవంతం చేయండి

కలకడ : మండలంలోని అన్ని ప్రభుత్వ చౌక దుకాణాలలో, ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేసే నిత్యవ సరసరుకుల పంపిణీ వేగవంతం చేయాలని తహసీల్దార్ ఫణికుమార్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని కలకడ, బాలయ్యగారిపల్లె పంచాయతీలలో బియ్యం పంపిణీపై వీఆర్‌ఓలతో ఆరా తీశారు. ప్రతి రోజు ఉదయం 7గంటల లోపు పంపిణీ ప్రారంభించి రోజువారి ప్రతి పంచాయతీలో 200 కార్డులకు తక్కువ కాకుండా అందించాలన్నారు. మండలంలో పంపిణీ శాతం చివరి స్థానంలో ఉందని గుర్తు చేశారు. కేవలం 5రోజులు పాటు శ్రద్ధగా పంపిణీ చేస్తే మండల పంపిణీ శాతం మెరుగుపడుతుందన్నారు. నిర్లక్ష్యం చేసినా, అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంచాయతీ కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఈఓ గురుమోహన్

పీలేరు : స్థానిక గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో 115 మంది కార్మికులకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దుస్తులు, సోపులు, స్నానపు సోపులు, కొబ్బరి నూనె, గ్లౌసులు తదితర వస్తువులు పంపిణీ చేసినట్లు ఈఓ గురుమోహన్ తెలిపారు. కార్మికులు ప్రజలకు అందుబాటులో ఉండి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ నౌషాద్, వార్డు మెంబర్లు మల్లికార్జునరెడ్డి, ఉదయ్, నాయకులు రామ్మూర్తి, కంచి సూరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఐ హరిహర ప్రసాద్

పెద్దతిప్పసముద్రం: మహిళా దినోత్సవంలో భాగంగా మంగళవారం ఎస్‌ఐ హరిహర ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా చట్టాలు, ఫోక్సో కేసులు, బాల్య వివాహాలు, మహిళా రిజర్వేషన్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ శివకుమారి సమక్షంలో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

రైతులను ఆదుకోవాలి

లక్కిరెడ్డిపల్లి : ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి రైతులను, ప్రజలను ఆదుకోవాలని లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం గుడ్లవారిపల్లిలో సర్పంచ్ వెంటనారాయణ రెడ్డి, మాజీ చైర్మన్ నరసింహారెడ్డిలు ఇచ్చిన విందుకు స్థానిక ఎంపీపీ సుదర్శన్ రెడ్డితో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది ఖరీఫ్‌లో రైతులు పూర్తిగా నష్టపోయారని వారికి అందాల్సిన పంట నష్టపరిహారం ప్రభుత్వం అందజేసి ఆదుకోవాలని కోరారు.

ముగిసిన పోలేరమ్మ జాతర

గాలివీడు : మండల కేంద్రంలోని శెట్టివారిపల్లెలో పోలేరమ్మ జాతర మంగళవారం అసాధుని కథతో ముగిసింది. సద్దలకూడు నైవేద్యంతో జాతరకు అంకురార్పణ చేసిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక విశేష పూజలు చేశారు.

నిధులు ఇవ్వక.. పనులు పడక

- ఆగిన నాడు–నేడు పనులు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- నిధులు మంజూరు చేయని కూటమి ప్రభుత్వం



వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన నాడు–నేడు పనులు

మదనపల్లె సిటీ: విద్యాశాఖలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మకమార్పులు తీసుకువచ్చారు. ఇందులో భాగంగా నాడు–నేడు కింద పలు పాఠశాలలు నిర్మించారు. కొత్త భవనాలు నిర్మించడంతో విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపడ్డాయి. రెండో విడత కింద ప్రారంభించిన నాడు–నేడు పనులు కూటమి ప్రభుత్వం రాగానే ఆగిపోయాయి. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని రాంరెడ్డిలేవుట్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల నాడు–నాడు కింద అదనపు తరగతి గదులు కింద రూ.10 లక్షలు అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం మంజూరు చేసింది. తరగతి గదులు నిధులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులకు గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో సుమారు 1000 మందికిపైగా విద్యార్థులున్నారు. ఇప్పటి వరకు 24 గదులు ఉండగా అందులో మూడు గదులు ఆఫీసు, ల్యాబ్, స్టోర్‌రూములకు ఉపయోగిస్తున్నారు. అదనపు గదులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం నాడు–నేడు కింద నిర్మాణంలో ఉన్న భవనాలను నిధులు మంజూరు చేయకుండా నిలిపివేశారు. ఈ విషయంపై పాఠశాల హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నిధులు నిలిపివేయడం వల్ల పనులు జరగలేదన్నారు.

విద్యుత్ పంపిణీకి వెన్నెముక లైన్‌మన్

- ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం
- ఘనంగా లైన్‌మన్ దినోత్సవ వేడుకలు



లైన్‌మన్ దినోత్సవం సందర్భంగా కేక్‌కట్‌చేసి సిబ్బందికి తినిపిస్తున్న ఈఈ గంగాధరం

మదనపల్లె : విద్యుత్ రంగంలో ఫ్రంట్‌లైన్ వర్కర్‌గా పేరొందిన లైన్‌మన్, విద్యుత్ పంపిణీకి వెన్నెముకలాంటి వాడని ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం అన్నారు. మంగళవారం మార్చి 4, విద్యుత్ లైన్‌మన్ దినోత్సవం సందర్భంగా మదనపల్లె డివిజన్ ఈస్ట్‌సెక్షన్‌లో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఈఈ గంగాధరం, సిబ్బంది సమక్షంలో కేక్‌కట్ చేసి లైన్‌మన్‌లకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ... విద్యుత్ రంగానికి లైన్‌మన్లు వెన్నెముక వంటి వారని, ప్రజలకు, పరిశ్రమలకు నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఎండనక, వాననక, తుఫాను, ప్రకృతి విపత్తులు తదితర సమయాల్లోనూ తన సేవలందిస్తూ నిరంతర విద్యుత్ అందిస్తున్నాడన్నారు. ప్రస్తుతం పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎక్కడా అవాంతరం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే లైన్‌మన్లు విధి నిర్వహణలో అవసరమైన భద్రతాప్రమాణాలు తీసుకుకోవాలన్నారు. ఈస్ట్ సెక్షన్ ఏఈ కుమార్ బాబు మాట్లాడుతూ... ప్రజలకు నిరంతర విద్యుత్ అందించేందుకు సిబ్బంది ఎంతో కష్టపడి పనిచేస్తుంటారని, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ శుభాభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో లైన్ ఇన్స్‌పెక్టర్ కంచి నాగరాజు, బాలకృష్ణ, శేషాద్రి నాగరాజు, రామచంద్రనాయక్, లక్ష్మీనారాయణ, కిషోర్, కృష్ణ, ఫుజైల్, రెడ్డికిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ సుజాత

మదనపల్లె : యోగా చేయడం వల్ల అందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని యోగా ట్రైనర్ సునీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఐసీడీయస్ సీడీపీఓ సుజాత ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కార్యాలయంలో హెల్దీ ఉమెన్– హ్యాపీ ఉమెన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ట్రైనర్ సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందితో యోగాసనాలు వేయించారు. ప్రతి ఒక్కరూ యోగా కార్యక్రమం నిర్వహిస్తే జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారన్నారు. మహిళా సాధికారత సాధించడం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. సీడీపీఓ సుజాత మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు మెరుగైన పోషకాహారాన్ని అందిస్తే వారు, వారికి పుట్టిన బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ఆహారపదార్థాలు, చిరుధాన్యాలు, పౌష్టికాహారం, బాలికలు, మహిళల హక్కులు, చట్టాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు.

బహిరంగ వేలం నిర్వహించాలని వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రంగసముద్రం చెరువులో చేపలు పట్టుకునేందుకు అధికారులు బహిరంగ వేలం నిర్వహించాలని బీజేపీ నాయకులు మంగళవారం ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చెరువును దక్కించుకున్న హెచ్చు పాటాదారుల గడువు ముగియడంతో అధికారులు గత ఏడాది చడీ చప్పుడు లేకుండా తిరిగి వారికే రెన్యువల్ చేసేందుకు ప్రయత్నించడంతో ప్రజలంతా అడ్డుకున్నారన్నారు. అనంతరం గతంలో చెరువును దక్కించుకున్న నిర్వాహకులు తాము నష్టపోయామని తిరిగి మళ్ళీ తమకే రెన్యువల్ చేయాలని కోరుతూ న్యాయస్థానం ఆశ్రయించారన్నారు. కోర్టులో కేసు నడుస్తుండగానే నిర్వాహకులు చెరువులో చేపలు పట్టుకునేందుకు రాత్రి వేళల్లో తూములు ఎత్తేసి నీటిని వృథా చేశారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో అధికారులు వృథా నీటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టి వేలం నిర్వహించాలంటే ముందస్తుగా రంగసముద్రం,రావూరివాండ్లపల్లి పంచాయతీల్లో చాటింపు వేయాలన్నారు. అధికారులు ప్రలోభాలకు తలొగ్గి గుట్టుగా రెన్యువల్ చేసినా, వేలం నిర్వహించినా తాము జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని జిల్లా, మండల స్థాయి నాయకులు మల్లెం శివయ్య, రావూరి శ్రీకాంత్‌రెడ్డి, శంకర్, నాగరాజు, మంజునాథ్, రెడ్డిశేఖర్ పేర్కొన్నారు.


11న గొర్రెల, మేకల పెంపకందారుల ధర్నా



సమావేశంలో గొర్రెలు మేకలు పెంపకందారుల నాయకులు

పీలేరురూరల్ : ఈ నెల11న గుంటూరులో నిర్వహించనున్న గొర్రెల మేకల పెంపకందారుల ధర్నా జయప్రదం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట నారాయణ బాబు అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్‌లో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాంసం ఉత్పత్తికి కీలక పాత్ర పోషిస్తున్న సన్న జీవాల యజమానుల సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నట్లు తెలిపారు. మేత, నీరు, వైద్యం, సబ్సిడీ రుణాలు తదితర సమస్యల పరిష్కారానికి గొర్రెలు, మేకల అభివృద్ధి ఫెడరేషన్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రమేష్, కృష్ణయ్య, మునిశేఖర్, రెడ్డిశేఖర్, రమణయ్య, కదిరప్ప, గురవయ్య, జయచంద్ర పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా అందించేందుకు చర్యలు



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరు రూరల్ : బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలోని యర్రగుంటపల్లె పంచాయతీ ముదుపులవేములవారిపల్లెకు చెందిన మూడే రాజేష్‌నాయక్ (30) పోక్సో కేసులో 2022 మార్చి 29న పీలేరు సబ్‌జైలులో రిమాండ్ ఖైదీగా చేరాడు. 2022 జూలై 8న సబ్‌జైలులోనే ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి ఆదేశాల మేరకు మంగళవారం సబ్‌జైలు సూపరింటెండెంట్ కె.చంద్రశేఖర్, తహసీల్దార్ భీమేశ్వర్‌రావు మృతుడి కుటుంబ సభ్యుల చేత వివరాలు సేకరించారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు వారు తెలిపారు. త్వరలో రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేయనున్నట్లు చెప్పారు.

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య జిల్లాలోని ఆశ వర్కర్ల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ మంగళవారం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గంగాధర్ ఆధ్వర్యంలో శెట్టిగుంట ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ప్రభుత్వం రూ.26 వేలు జీతం అందించి మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

పెద్దతిప్పసముద్రం: ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం చట్టాలను, జరిమానాలను కఠినతరం చేసిందని, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యమని ఎస్‌ఐ హరిహర ప్రసాద్ అన్నారు. మంగళవారం రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మైనర్లు వాహనం నడిపితే యజమానికి మూడు నెలల శిక్ష, హెల్మెట్ , సీట్ బెల్ట్ లేకుంటే రూ.1,035లు, లైసెన్స్ లేకుంటే రూ.5,035లు, నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్‌కు రూ.లక్ష, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే రూ.2 వేలు, వాహనం వేగంగా నడిపితే రూ.5 వేల జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాద రహిత మండలంగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పీలేరురూరల్ : బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని లేబర్ ఆఫీసర్ ఆర్.కె. ఆనంద బాబు, ఎంఈఓ లోకేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక చిత్తూరు, క్రాస్ రోడ్డు ప్రాంతంలో వివిధ దుకాణ యజమానులకు అవగాహన కల్పించారు. 14 సంవత్సరాలు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బడిఈడు పిల్లలు కేవలం బడిలో మాత్రమే ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రేట్ విజన్ సంస్థ అధ్యక్షులు జి.వి.ఎస్. బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా, ప్రజా సంఘాల నాయకులు గట్టప్ప, గ్రేవిజన్ సొసైటీ మహిళా కోఆర్డినేటర్ రూప, లావణ్య, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకోండి

రామాపురం : పంటలు సాగు చేసిన ప్రతి రైతు సేవా కేంద్రంలో తమ పంట నమోదు చేసుకొని ఈకేవైసీ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వై.నాగమణి పేర్కొన్నారు. మండలంలోని బండపల్లి, కుమ్మరపల్లె గ్రామాలలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు రైతు మీసేవ కేంద్రంలో ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. భూమి కలిగిన ప్రతి రైతు వ్యవసాయ శాఖ ద్వారా పథకాలు పొందాలంటే రైతులు తమ పంటలను రైతు సేవా కేంద్రంలో తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. రైతులు రైతు సేవా కేంద్రంలో పట్టాదారు పాసు పుస్తకాలు, ఆధార్‌కార్డు, ఆధార్ లింకు ఫోన్‌నెంబరును వెంట తీసుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రపంజని, సిబ్బంది హరీష్, మంజుల, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు అవగాహన

లక్కిరెడ్డిపల్లి : మామిడిలో పండు ఈగ నివారణకు కవర్లు వినియోగంపై మండలంలోని దప్పేపల్లి, కోనంపేట గ్రామంలో మంగళవారం మామిడి రైతులకు ఉద్యాన అధికారి (హెచ్‌ఓ) నాగమణి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి కాయ పెద్ద నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు కాయలకు కవర్లు వాడటం వలన నాణ్యమైన కాయలను పొంది ఎగుమతి చేయడం వలన అధిక ధర లభిస్తుందని చెప్పారు. అలాగే పండు ఈగ (ఊజీగ) కాయ తొలుచు పురుగు, వివిధ తెగుళ్లు, అధిక గాలుల నుంచి పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. మామిడి కాయలను ఎక్కువకాలం చెట్టుపై నిల్వ చేసి మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవడానికి వీలవుతుందని వివరించారు. పురుగు మందుల వాడకం కోసం రైతు పెట్టే ఖర్చు చాలా వరకు తగ్గించుకోవచ్చన్నారు. మామిడి కాయలకు కవర్లు ఎకరాకు 4 వేల కవర్లు అవసరం ఉంటుందని, ఒక ఎకరాకు కవర్లు కట్టుకోవడానికి రైతుకు 50శాతం సబ్సిడీతో రూ. 4 వేలు ఉద్యానశాఖ ద్వారా సబ్సిడీ వర్తిస్తుందని, ఒక రైతుకు అత్యధికంగా పదివేల కవర్లు ఇవ్వనున్నట్లు తెలియజేశారు. మామిడి రైతులు తమ గ్రామ రైతు సేవా కేంద్రం సహాయకులను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.

వాహనమిత్ర అమలు చేయాలని నిరసన



ఆటోడ్రైవర్లకు వాహనమిత్ర పథకం అమలు చేయాలని నిరసన తెలుపుతున్న కార్మికులు

మదనపల్లె : ఆటో డ్రైవర్స్, ఇతర మోటార్ కార్మికులకు వాహనమిత్ర పథకం కింద వెంటనే రూ.15వేలు ఇవ్వాలని, జీఓ నెంబర్.21, 31లను రద్దుచేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి ముబారక్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ ఫెడరేషన్(ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి పిలుపుమేరకు మంగళవారం ఆర్.ఆర్.స్ట్రీట్ ఆటో స్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర కింద రూ. 15 వేలు ఇస్తామని, భారీగా జరిమానాలు విధించే జీఓ నెంబర్ 21, జీఓనెంబర్. 31ని రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు అంతే కాకుండా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని డీజిల్ పెట్రోల్ ధరలు తగ్గిస్తామని చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై.... 9 నెలలు పూర్తి అవుతున్నా, ఎన్నికల హామీలు నెరవేర్చలేదన్నారు. ప్రైవేట్ ఫైనాన్స్‌లు వసూలుచేస్తున్న అధికవడ్డీలు రద్దుచేయాలని డిమాండ్ చేశారు . మున్సిపాలిటీ, పంచాయతీలలో ఆటోలు నిలుపుకోవడానికి పార్కింగ్ స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.అర్హులైన ఆటో డ్రైవర్లకు ఇంటి స్థలాలు ఇచ్చి, ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లె పట్టణ కార్యదర్శి తిరుమల,ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేష్, మస్తాన్, గంగులప్ప, మహబూబ్ భాషా, మస్తాన్ ఖాన్,జుబేర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగాన్ని పటిష్టం చేయాలి



నిసార్‌అహ్మద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి

మదనపల్లె : నియోజకవర్గ వ్యాప్తంగా యువజన విభాగాన్ని పటిష్టం చేసి, పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిందిగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి వచ్చిన ఆయన నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్, ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీ బలోపేతానికి చేయాల్సిన విధి, విధానాలు, యువజన విభాగం పటిష్టతకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మునిశేఖర్, కొత్తపల్లె మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కలికిరి : వైఎస్సార్‌సీపీ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం యువజన విభాగం జిల్లా అధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా మాజీ ఎమ్మెల్యేని కలిశారు. నియోజకవర్గంలో యూత్ కమిటీలపై చర్చించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడి

తాలూకా సీఐ కళా వెంకటరమణ



సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న తాలూకా సీఐ కళా వెంకటరమణ, సర్పంచ్ పి.చలపతి

మదనపల్లె : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, నేరాలను కట్టడి చేయవచ్చని తాలూకా సీఐ కళావెంకటరమణ అన్నారు. మంగళవారం మండలంలోని చిప్పిలిలో సర్పంచ్ పసుపులేటి చలపతి ఆధ్వర్యంలో గ్రామస్తులకు సీసీ కెమెరాల ఏర్పాటు, ఆవశ్యకత, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు కాపాడేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకువచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపుచేయవచ్చని, దొంగతనాలు నివారించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. రోడ్డుప్రమాదాలు, దొంగతనాలు తదితర ఘటనలు జరిగిన పరిస్థితుల్లో సీసీ కెమెరాల ద్వారా వారిని గుర్తించి పట్టుకునేందుకు మూడోనేత్రంగా ఉపయోగపడుతుందన్నారు. దొంగతనాల నియంత్రణకు చిప్పిలి గ్రామంలోని దుకాణాలు, వ్యాపారసంస్థల వద్ద షాపు లోపల, బయట రోడ్డు కనిపించే విధంగా సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకోవాలన్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేవారు ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో చిప్పిలిహరి, కృష్ణారెడ్డి, నక్కలదిన్నె మేస్త్రీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి

ఐసీడీఎస్ పీడీ రమాదేవి



విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న పీడీ రమాదేవి

పీలేరు : పూర్వ ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఐసీడీఎస్ పీడీ రమాదేవి అన్నారు. మంగళవారం పీలేరు పట్టణం ఆర్టీసీ నల్లగుట్టలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కంద్రంలోని స్లాక్ రిజిస్టర్లను, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. పూర్వ ప్రాథమిక విద్యార్థుల సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,275 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో 1858 ప్రధాన కేంద్రాలు, 417 మినీ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. 1030 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, 795 కేంద్రాలు అద్దె భవనాల్లో, 450 కేంద్రాలు ఉచిత భవనాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు బాలలు 42037 మంది అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరై పౌష్టికాహారం స్వీకరిస్తూ, పూర్వ ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో రాజమ్మ, సూపర్‌వైజర్ స్వరూప, అంగన్‌వాడీ వర్కర్లు అఖిల, అనిత పాల్గొన్నారు.

నిరుపయోగంగా హంద్రీనీవా కాలువ, సమ్మర్‌స్టోరేజీలు

- వినియోగంలోకి తీసుకొచ్చి నీటిసరఫరా చేయాలి
- వేసవిలో సాగు,తాగునీటి ఇబ్బందులు తొలగించాలి
- డీఏఓ రాఘవేంద్రకు వినతి



సబ్ కలెక్టరేట్ డీఏఓ రాఘవేంద్రతో మాట్లాడుతున్న బీవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పునీత్

మదనపల్లె : ప్రజల సాగు,తాగునీటి అవసరాలు తీర్చేందుకు కోట్లు ఖర్చుచేసి నిర్మించిన హంద్రీనీవా కాలువ, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయని, రాష్ట్రప్రభుత్వం వీటిని వినియోగంలోకి తెచ్చి నీటిసరఫరా చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పునీత్ కోరారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఏఓ రాఘవేంద్రను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ... హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని తీసుకువచ్చి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులను నింపి, స్థానిక ప్రజల సాగు,తాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం వీటిని ఏర్పాటుచేసిందన్నారు. అయితే.. హంద్రీనీవా కాలువలో నీటిసరఫరా చాలాకాలంగా జరగకపోవడంతో పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు మొలిచి భయంకరంగా తయారైందన్నారు. అలాగే మదనపల్లె పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చిప్పిలి, గుట్టకిందపల్లెలో నిర్మించ తలపెట్టిన సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులు 20 ఏళ్లవుతున్నా ఇప్పటికీ వినియోగంలోకి తేలేదన్నారు. వీటి కోసం ఏర్పాటుచేసిన భవనాలు శిథిలస్థితికి చేరుకోవడమే కాకుండా కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయిందన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయేగాని, నీటిసమస్య శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. హంద్రీనీవా కాలువ దుస్థితిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే... కాలువను విస్తరణ చేయాల్సి ఉందని, పనులు పూర్తయ్యాకే నీటిసరఫరా జరుగుతుందని తేల్చేశారన్నారు. అధికారులు, నాయకులు కేవలం కాలయాపన చేసేందుకే కాలువ విస్తరణ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చారని అర్థమవుతోందన్నారు. వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో ఇప్పటికే చెరువులు ఎండిపోయాయని, బోర్లలో నీటిలభ్యత తగ్గుతోందని, ప్రస్తుత పరిస్థితుల్లో హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణాజలాలను తీసుకువస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు జిలానీ, శ్రీనివాసులు, ఆది, నవీన్, జగదీష్, ద్వారకా, వినయ్, ఉదయ్, జస్వంత్, కిరణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.